# అనంతం

పరుగెత్తే జీవితం కాలు విరిగి కూలబడిపోయినట్టనిపించింది - దానిని ఆ స్థితిలో చూసేసర్కి

శీతాకాలపు సాయంకాలం. అయిదున్నర గంటలవుతోంది. ఊరికి దూరంగా... మూడు కిలోమీటర్ల దూరంలో ఆకాశం వైపు ఎక్కుపెట్టిన పొగ గొట్టాలతో ఒక వంక పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నా మరొక ప్రక్క ఆ ప్రాంత వాసులకు కనీసం చిన్న ఉద్యోగాలిచ్చి అయినా ఉపాధి కల్పించిన ఘనతను దక్కించుకున్న కంపెనీ.

కంపెనీ బస్సులూ, కార్లూ, స్వంత వాహనాలూ... అన్నీ సైరన్ మ్రోగిన పది నిముషాల్లో తుపాకీ గుండు శబ్దానికి చెల్లాచెదరై ఎగిరిపోయిన పిట్టల్లా కంపెనీ ఆవరణను ఖాళీ చేసేసాయి.

బయట కలకలం తగ్గింది. నాలో కలవరం బయల్దేరింది. ఇప్పుడెలా?

ఉదయం కంపెనీకి వచ్చినప్పుడు నిక్షేపంలా వున్న స్కూటరు యిప్పుడిలా తయారవడం ఆశ్చర్యం మాటెలా వున్నా సమస్యలా తయారైంది. జీవితమైనా, స్కూటరైనా సజావుగా నడుస్తూన్నంత వరకే గదా అనిపించింది.

తీసిన స్టాండు మళ్ళీ వేసి, దాన్ని యథాస్థానంలో వుంచి ఏం చేయడానికీ పాలుపోక మోటార్ వెహికల్ సెక్షన్ వైపు నాలుగడుగులు వేశాను. అక్కడెవరూ ఉన్న జాడ లేదు. పరుగెత్తుతూన్నంతకాలం ఎక్కి సవారీ చేయడమే గాని దానికేదైనా యిబ్బంది వస్తే చికిత్స చేయలేని అశక్తత. దగ్గర్లో స్కూటర్ మెకానిక్ షాపులేవీ లేవు. మెకానిక్‌కి చూపించాలంటే ఊళ్ళోకి మూడు కిలోమీటర్ల దూరం స్కూటర్‌ని తీసుకువెళ్ళాలి. లేదా అక్కడకు వెళ్ళి ఏ మెకానిక్‌నో బతిమాలి రప్పించుకోవాలి. ఈ రెండూ కుదరని పక్షంలో స్కూటర్‌ని కంపెనీ షెడ్‌లోనే వదిలేసి వెళ్ళిపోయి మర్నాడే దాని సంగతి చూడాలి. డ్యూటీ అవర్స్‌లో చూసుకుని వుంటే మోటార్ వెహికల్ సెక్షన్‌లోని ఎవరైనా బాగుచేయడమో, సరైన సలహా చెప్పడమో చేసేవారు.

అసలే జీతాల రోజు సాయంకాలం. ఎప్పుడెప్పుడు యిళ్ళకు జేరుదామా

అన్నట్టుంటారంతా. ఎవరో....... నాలాంటి స్వంత వాహనాలున్న కొద్దిమంది మాత్రం మిగిలివున్నట్లున్నారు.

కనిపించిన ఒకరిద్దరు కూడా ఏవేవో ప్రశ్నలు వేసి, సమాధానం చెప్పేంతలోగానే వెళ్ళిపోయారు.

ఆలోచనలోనే పావుగంట గడిచిపోయింది.

సరిగ్గా అప్పుడు వచ్చాడు విఠల్, "ఏమిటీ? ఎవరికోసమైనా వెయిటింగా? లేక బండి దుకాణం పెట్టిందా?" అంటూను. అతను పర్సనల్ డిపార్ట్‌మెంట్లో పని చేస్తాడు. నేనంటే గౌరవం.

"ఎన్నాళ్ళనించో బందీ అయివుందిగా - సందు దొరికినట్లుంది బయటకుపోయింది, వెనుక చక్రంలోని గాలి" అన్నాను, ముఖం మీద కాస్త నవ్వును పులుముకుంటూ.

"పోనివ్వండి మరి. పోయిందాని గురించి పాకులాడడం ఎందుకూ? ఉన్న కన్నం పూడ్చే సంగతి చూస్తే సరి" అని నా ధోరణిలోనే సమాధానమిచ్చి, "స్టెఫినీ మార్చేసుకుంటే సరి" అన్నాడు.

"స్టెఫినీ కండిషన్‌లోనే వుంది - అయితే టూల్‌కిట్ లేదు. ఒక వేళ ఉన్నా నేను మార్చుకోలేను" అన్నాను.

"అయితే ఓ పని చెయ్యండి. మా బాస్ మరో అరగంట వరకూ ఎలానూ వుంటారు కాబట్టి నేనూ ఉండక తప్పదు. యీలోగా నా స్కూటర్ తీసుకెళ్లి మెకానిక్‌ని పిలుచుకొచ్చి బాగు చేయించుకోండి?" అన్నాడు.

ఆ సలహా ఏదో బాగుందనిపించింది.

మూడు కిలోమీటర్ల దూరమూ పది నిముషాలు దగ్గర జేశాయి. అయితే ఉండడం అక్కడ రెండు మెకానిక్ షాపులున్నా - "కంపెనీకి రావాలా? పనుంది సార్ రాలేను" అని ఒకరంటే, "మా కిప్పుడు కుదరదు సార్" అని మరొకరూ నిష్కర్షగానే చెప్పేశారు.

సమస్య మళ్ళీ మొదటకే వచ్చి గాలిపోయిన ట్యూబ్‌లా చతికిలబడే పరిస్థితి ఏర్పడింది. మెకానిక్ రాకపోతే బండి కదలదు. బండి కదలకపోతే ఇల్లు జేరడం యిబ్బంది. ఇంటికెలాగో వెళ్ళిపోయినా ఉంచేసిన స్కూటర్‌కి సెక్యూరిటీ వుంటుందో ఉండదో-

ఆలోచనలు... ఆలోచనలు...

సరిగ్గా అప్పుడు వచ్చేడు వాడు!

"ఏమిటిసార్. ఏమైందీ? స్కూటర్ రిపేరా?" అంటూను. పట్టుమని పదేళ్ళుంటా యేమో! మట్టీ, మడ్డి ఆయిలూ మాసిన బట్టలతో వున్నాడు.

"నువ్వేం చేస్తావ్?" అడిగాను.

"భలేవారే సార్. నేనూ మెకానిక్ కుర్రాడినే. అదిగో అదే మా బడ్డీ" అంటూ చూపించేడు అక్కడికి నాలుగడగుల దూరంలో వున్న చెట్టు కింది బడ్డీని.

నేను చెప్పింది విని, "పంచర్ రేపు వేయించుకుందాం సార్. ప్రస్తుతానికి స్టెఫినీ మార్చేద్దాం" అన్నాడు.

"స్కూటర్ మా కంపెనీ షెడ్‌లో ఉంది. నువ్వు రావాలి. నేను మళ్ళీ నిన్ను తీసుకొచ్చి యిక్కడ దింపుతాను" అన్నాను.

"అలాగే సార్. నేను వస్తూనే వుంటాను మీ కంపెనీకి" అని బడ్డీ దగ్గరకు వెళ్ళి, ఎవరికో చెప్పి పనిముట్లు చేతబట్టుకుని వచ్చి అస్త్ర శస్త్రాలతో అర్జునుడు కృష్ణుడి రథమెక్కినట్టు స్కూటర్ వెనక కూర్చున్నాడు.

కంపెనీకి చేరేక, ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం నిపుణుడైన సర్జన్ సమాయత్తమైనట్లు సిద్ధమయ్యాడు.

క్షణంలో పనిముట్లలో పని ముట్టుగా మారేడు. ప్లగ్ రెంచీ అయి బోల్టుల్నుండి నట్లను విడదీసేడు. సేఫ్‌గా స్టెఫినీని విప్పేడు. "స్టెఫినీ టైరు బాగులేదుసార్. మార్చేసుకోండి. వచ్చే నెలలో టైర్ల ధరలు పెరుగుతాయట" అని ఓ సలహా పారేశాడు. రెండు చక్రాల్నీ పసిబిడ్డల్లా తన ఒడిలో పెట్టుకుని తను తెచ్చిన గుడ్డతో వాటి మురికంతా వదిలేట్టు తుడిచేడు. బురదలో దొర్లివచ్చిన పిల్లల్ని లాలించి లాల పోసే తల్లిలా వాటిని శుభ్రపరిచేడు. స్టెఫినీని వెనుక చక్రం స్థానంలోనూ, పంచరైన చక్రాన్ని స్టెఫినీ స్థానంలోనూ బిగించి స్టెఫినీ కవరు తొడిగి బండికి అంటిన మరకల్ని తుడవడం మొదలుపెట్టేడు.

ప్రతి కదలికలోనూ శ్రద్ధే! వాడు చేసే ప్రతి పనిలోనూ శ్రద్ధే! ఇతరుల పని పట్ల నేడు కరువౌవుతున్న శ్రద్ధ! డబ్బు తీసుకుంటున్నా చేసే పని పట్ల ఎవరిలోనూ యిసుమంతైనా కనుపించిన శ్రద్ధ! వాడిలో.... ఆ పదేళ్ళ కుర్రాడిలో... .డబ్బు కోసమే అయితే మాత్రమేం? కనిపించింది.

ఎంతడుగుతాడో? ఇంత దూరమొచ్చి బండిని బాగుచేసి... బాగా చేసి... ఎంతైనా యివ్వొచ్చు మరి!

పదా? పదిహేనా?

అవసరానికి వచ్చేడు – రానన్న వాళ్ళతోపాటు వీడూ రానంటే ఏమయ్యేది? ఆటోగానీ రిక్షాగాని పిల్చుకొచ్చి స్కూటర్ తీసుకెళ్తే యిరవై రూపాయలేనా అవుతుంది.

వీడు ఇరవై యిమ్మంటాడేమో! ఎంతడిగినా అది వాడి కష్టానికి కాదు – తనకీ సమయంలో సాయపడ్డందుకే యివ్వాలి.

ఆకాశం మీంచి చీకటి తెరలు దిగుతున్నాయి.

సముద్రం మీంచి గాలి తెరలూ వీస్తున్నాయి.

కాస్త యిటుగా వచ్చి పర్సులోంచి అయిదు రూపాయల నోట్లు నాలుగు తీసి షర్టు జేబులో పెట్టుకున్నాను, ఎంతడిగినా యివ్వొచ్చని.

ఈ లోగా విఠల్ వచ్చేడు. వాళ్ల బాస్ నుండి విడుదలై – "ఏం సార్! బాగైందా" అంటూను.

'ఓ!' అన్నట్లు తలూపి, అతని స్కూటర్ తాళాలు అతనికందిస్తూ – "థేంక్స్ చెప్పను. అది చాలా చిన్న పదం నువ్వు చేసిన సహాయానికి" అన్నాను.

నవ్వేడతను. 'ఏముందిందులో' అన్నట్టు.

చేసిన సహాయం ఎంతటిదైనా అది అవతలి వారి అవసరాన్ని బట్టి విలువని సంతరించుకుంటుంది మరి!

"ఆల్ ద బెస్ట్" అన్చెప్పి విఠల్ వెళ్ళిపోయాడు.

"రేపు పంచరు వేయించేసి, ఆ చక్రమే బేక్ వీల్‌కి వేయించండి సార్" అన్నాడు వాడు, పనిముట్లు సంచిలో వేసుకుని లేచి-

'అలాగే' అన్నట్లు తలూపి, "ఎంతిమమ్మంటావ్" అనడిగేను.

"ఎంతో కొంత యివ్వండి సార్" అన్నాడు వాడు తలొంచుకుని.

"అలాక్కాదు. కష్టపడ్డవాడివి నువ్వు. నువ్వే చెప్పు" అన్నాను.

"నాలుగు రూపాయలివ్వండి సార్" అంటూ చిన్నగా నవ్వేడు.

నాలుగిస్తే నాకు సంతోషమే అన్నట్లనిపించిందా నువ్వు.

ఎదుటివారి అవసరాన్ని స్వప్రయోజనాలకు వాడుకోని వారింకా వున్నారనిపించింది వాడిని చూస్తే.

ఐదు నోటు యిద్దామనుకుంటూనే, అసంకల్పితంగా పర్సు తెరిచి రెండు రెండ్రూపాయల నోట్లు తీసి వాడి కందించేను. అందుకుని, "వస్తా సార్" అంటూ అడుగు ముందుకు వేశాడు వాడు.

"ఉండు నిన్ను అక్కడ దించేస్తానన్నానుగా"

"ఫర్వాలేదు సార్. నా కలవాటే నడక" అంటూ సిగ్గుపడ్డాడు.

"ఫర్వాలేదు. రా" అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాను. ఎక్కి, నాకు అంటుకోకుండా వెనుకన దూరంగా కూర్చున్నాడు.

మెటల్ రోడ్డు మీద బండి మెత్తగా సాగిపోతోంది. దారి పొడవునా వున్న సోడియం వేపర్ లేంప్స్ ముసురుకుంటున్న చీకట్లను దూరం చేస్తున్నాయి. కార్తీక మాసపు చల్లదనం యింకా గాలిలో అట్టే పుంజుకోలేదు.

ఉదయం నించీ పడ్డ శ్రమా, సాయంకాలం అనుభవించిన టెన్షనూ ఒక్కసారి పోయినట్టనిపించింది.

"ఏం పేరు నీదీ?' అప్పుడు అడిగేను వాడిని.

"అనంతవండీ" అన్నాడు వాడు.

"మీ ఓనరు నీకు జీతమెంతిస్తాడూ?" మరో ప్రశ్నాస్త్రం.

"రోజూ రెండు, వారానికి పదీనండి"

"ఇదెక్కడి లెక్క? రూపాయలేనా?"

"అవునండి"

తర్వాత నేనడిగిన ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలు చెప్పేడు.

రోజూ ఉదయం ఎనిమిదిన్నరకి ఐదు కిలోమీటర్ల దూరం నించి నడిచి వస్తాడట. తండ్రి లేడు. తల్లి పాచిపనులు చేసి కొంత సంపాదిస్తుందట. ఓనరు మధ్యాహ్నం టీ యిస్తాడట. కష్టమర్లిచ్చిన చిల్లర డబ్బులతో టిఫిన్ తింటాడు - రాత్రి ఎనిమిది గంటలకు

తిరిగి యింటికి నడిచి వెళ్తాడట.

"మరి... ఇంత తక్కువ జీతానికి ఎందుకొప్పుకున్నావ్? పని కష్టం కదా" అన్నాను.

"కష్టమే. కానీ నేను చేసేది డబ్బు కోసమే కాదు గదా"

"మరి?"

"మా ఓనరు మంచి మెకానిక్ సార్. అతని దగ్గర చేస్తే నాకు పని వస్తుందిగా. పని నేర్చుకుంటే రేపు ఎక్కడేనా నాలుగు డబ్బులు సంపాదించుకోవచ్చును" అన్నాడు ఆరిందాలా.

వాడి ఆలోచన బాగానే వుంది. కానీ పని నేర్చుకోవడం కోసం చదువుకునే వయస్సులో వున్న పదేళ్ళ కుర్రాడు పాకులాడ్డం, రేపటి జీవిక కోసం ఆలోచించడం, రోజంతా కష్టపడ్డం కాస్త బాధనిపించింది.

మన దేశంలో బాల కార్మికుల సమస్య చాలా తీవ్రంగా వుందనీ; వారి దుస్థితిని గురించీ; వారిని శ్రమ దోపిడీ నించి విముక్తి చేయాలనీ రోజూ ఏదో ఒక మూల పేపర్లలో మంత్రివర్యుల ప్రకటనలు వుండనే వుంటున్నాయి. మరి ఆ సమస్య మూలాల్ని పరికిస్తే.... అటువంటి వారి ఆర్థిక అవసరాలను అవలోకిస్తే... దాని తీవ్రరూపం బోధపడకుండా ఉంటుందా?

పేదరికమే చాలామంది చిన్నారుల్ని పనివాళ్ళుగా మారుస్తోందన్న విషయం పరిశోధించకుండానే తేటతెల్లమయ్యే సత్యం అయినప్పుడు బాలలను శ్రమ దోపిడీ నుండి విముక్తి చేసి చేతులు దులుపుకునే కంటే వారికి వృత్తిపరంగా శిక్షణ నివ్వడం అవసరమేమో!

పేదరిక నిర్మూలన కోసం పాటుపడదలచుకున్న ఏ ప్రభుత్వమైనా కులమతాల కతీతంగా దృష్టి సారించి ఆర్థికంగా వెనుకబడ్డవారికి ఉపాధిని కల్పిస్తే బాగుంటుందేమో!

మరి.... నిత్యం న్యూస్ పేపర్లలో దర్శనమిచ్చే ఉపాధి కల్పనా పథకాలన్నీ ఎందరికి ఉపయోగపడుతున్నట్లు?

ఆలోచనలు ఎక్కడికో పోతున్నాయి.

"ఆపండి సార్" అంటూ అరుస్తున్నాడు అనంతం. అప్పటికే వాడి బడ్డీ కొట్టు దాటి స్కూటరు ముందుకొచ్చేసింది.

బ్రేకు వేస్తే దిగి, "వస్తాను సార్" అంటూ తుర్రుమన్నాడు.

ఇంటికొచ్చేక కాస్త రిఫ్రెష్ అయి, బాల్కనీలో కూర్చుని ఆ రోజు న్యూస్‌పేపరు తీశాను. ఇందాకటి సమస్యే వెంటాడుతున్నట్లుగా మళ్ళీ దర్శనమిచ్చింది.

భారతదేశంలోని బాల కార్మికుల సమస్యపై ఆ మధ్య అగ్రరాజ్యమైన అమెరికా తీవ్రమైన విమర్శతో ఒక నివేదికను ప్రకటించిందట. ప్రపంచం మొత్తం మీద ఎక్కువమంది బాలకార్మికులు భారతదేశంలోనే వున్నారట. విద్యా వ్యవస్థ వైఫల్యమూ, విస్తృతమైన అవినీతీ అందుకు కారణమట.

ఆశ్చర్యమే మరి! మేధావులందరూ కలిసి విద్యా వ్యవస్థను చక్కదిద్దగలరేమోగాని

ఎంత మంది కలిసినా యీ దేశంలోని అవినీతిని అంతమొందించగలరా అన్నదే ప్రశ్న.

◆ ◆ ◆

మర్నాడుదయం కంపెనీకి బయల్దేరుతూ స్కూటర్ తీసేసరికి మళ్ళీవాడు గుర్తుకొచ్చేడు. ఈపాటికి యజమాని పర్యవేక్షణలో ఏ స్కూటర్నో మోపెడ్నో విప్పి బాగుచేస్తూంటాడు.

ఒక రకంగా ఆలోచిస్తే నలుగురు కుర్రాళ్ళకి పని నేర్పించి కాస్తంత ఉపాధి చూసే వాడి 'ఓనరు' లాంటి వాళ్ళు అవసరమేమో నేటి పరిస్థితుల్లో అనిపించింది.

వారం రోజుల వరకూ పని ఒత్తిడి. ఆ తర్వాత వాడి ద్వారానే పంచరు వేయించి వెనుక చక్రం యథాస్థానంలోకి మార్పించేను. ఈ మారు వాడు అడిగిన దానికంటే ఓ రూపాయి ఎక్కువే యిచ్చాను.

"కొత్త టైరూ ట్యూబూ కొనేయండి సార్. మళ్ళీ ధరలు పెరిగిపోతాయి" అన్నాడు వచ్చేస్తూంటే.

"అలాగేలే" అంటూ వచ్చేశాను.

ఆ తర్వాత వాడి బడ్డీ వైపు వెళ్ళే అవసరమే కలగలేదు.

◆ ◆ ◆

ఎప్పుడో ఎప్లయ్ చేసి ఇంటర్వ్యూకి కూడా వెళ్ళి వచ్చిన బెంగుళూరు ఉద్యోగం రావడం నా జీవన గతిలో ఓ అనుకోని మార్పుని తెచ్చిపెట్టింది. పుట్టి పెరిగిన వూరూ, స్వరాష్ట్రం వదిలి యింతవరకూ చదువుకోసమైతేనేమి, ఉద్యోగం కోసమైతేనేమి మరో చోటుకి వెళ్లే అవసరం కలగలేదు. కానీ యిప్పుడొచ్చిన యీ ఉద్యోగం మరో ఆరేళ్ళకు గాని యిక్కడ రాని అంతస్తును వెంటనే తెచ్చిపెడుతుంది. ఆర్థికంగా చాలా లాభసాటి కూడా! చదువుల కోసం, ఉద్యోగాల కోసం యీ దేశంలోని యువత రాష్ట్రాలూ, దేశాలూ కూడా దాటిపోతున్న యీ రోజుల్లో – వేసే ప్రతి అడుగులోనూ దాటే ప్రతి గడిలోనూ మింగ జూసే పాములున్న యీ జీవిత వైకుంఠపాళీలో మరో రెండు నిచ్చెనలెక్కే అవకాశం యీ ఉద్యోగం ద్వారా వస్తున్నప్పుడు కాదనుకోవడం తెలివి తక్కువే అవుతుందనిపించింది.

ఇంజనీరింగ్లో నేను చేసిన డిప్లమో ఉన్న వూళ్ళోనే చిన్న ఉద్యోగాన్ని సంపాదించి పెడితే, దాని ద్వారా వచ్చిన అనుభవం, నైపుణ్యం మరో మంచి ఉద్యోగాన్ని సంపాదించి పెట్టేయి.

కొత్త ఉద్యోగం నిత్యం కొత్త విషయాల్ని తెలుసుకునే అవకాశాన్ని కలిగిస్తూ మెదడుకు పదును పెడుతూన్నా మూడేళ్ళు తిరక్కుండానే సూపర్వైజరీ కేడర్లో మరో మెట్టు ఎక్కేలా చేసినా, మనసు మాత్రం స్వంత వూరి వైపు లాగడం మానలేదు–

చివరకు మనసు మాటే మన్నించి, స్వంత వూళ్ళోనే మరో కొత్త కంపెనీలో సమాన హోదాగల ఉద్యోగానికి వచ్చేశాను, ఐదేళ్ల తర్వాత.

పల్లెటూళ్ళు నగరాలుగానూ, నగరాలు పట్నాలుగానూ ప్రగతి పథంలో అభివృద్ధి చెందితే ఆశ్చర్యపోనక్కరలేదు. అయితే యీ అయిదేళ్ళలోనూ మా వూరు నాగరికంగానే అభివృద్ధి చెందడం ఆశ్చర్యమనిపించింది. ముఖ్య కూడళ్ళలో బట్టల షాపులూ, టైలరింగ్

షాపులూ, రేడియో టీవీల షాపులూ, ఆడియో కేసేట్లు అమ్ముతూ పాటల రికార్డు చేసే షాపులూ చాలానే వచ్చాయి. ఊరి ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డ దాఖలాలు మాత్రం అట్టే కనిపించలేదు. లవెండర్ కెనాల్ అనే ముద్దు పేరున్న మురుగు కాలువను ఆనుకొని వున్న పూరి పాకలు అలాగే అదే స్థితిలో వున్నాయి. సంఖ్యలో కాస్త పెరిగాయేమో కూడా. అయితే యీ వచ్చిన నాగరీకమంతా కంపెనీల్లో పనిచేసే వారి కోసం వచ్చినదే అనిపించింది. ఈ దుకాణాలన్నీ వారిపై ఆధారపడి బతుకుతున్నవే మరి!

అనుకోకుండా ఓ రోజు మా కొత్త కంపెనీ గేటు ముందు లాటరీ అమ్ముకునే ఓ కుర్రాడు కనిపించి పలకరించేడు. "ఏం సార్. యిప్పుడు మీరీ కంపెనీకి వచ్చేశారా" అంటూను. నేను పోల్చుకోలేక ఆశ్చర్యంగా ముఖం పెడితే వాడే గుర్తు చేశాడు.

వాడు – అనంతం!

వాడి పెరిగే వయసుకు మరో అయిదేళ్ళొచ్చేయేమో మనిషి కాస్త మారేడు. పొడుగయ్యేడు కూడా.

"ఇదేమిటీ పని?" అన్నాను వాడి చేతిలోని లాట్రీ టిక్కెట్లు చూసి.

వాడు చిన్నగా నవ్వి వూరుకున్నాడేగాని మాట్లాడలేదు.

"అది సరే – పని నేర్చుకుని మెకానిక్ అవుతానన్నావుగా"

"మాలాటోళ్ళు అనుకుంటే అవుద్దా సార్" అంటూ విషయాన్ని చెప్పుకొచ్చేడు.

వాడు పని చేసిన షాపు ఓనరు మంచి పనివాడే గాని మందు దాసుడు– మోతాదు మించనప్పుడు పని చేసి బాగా సంపాదించేవాడుట. డబ్బులొస్తే పీకలమొయ్యా తాగి పడుకునేవాడుట. అంచేత వచ్చే కష్టమర్లు కూడా రావడం మానేశారుట. ఓ రోజు కల్తీ సారా తాగి రాత్రి పడుకున్నవాడు మరి లేవనేలేదుట.

"పోనీ మరో చోట చేరకపోయావా?" అన్నాను.

"ఈలోగా మా అమ్మకు సుస్తీ చేసింది సార్. కడుపులో ఏదో వుందుట. క్షణాల మీద ఆపరేషన్ చెయ్యాలన్నారు. ఆసుపత్రి గవర్నమెంటుదే అయినా డాక్టరు ఫీజు యిచ్చుకోవాలన్నారు. డబ్బు కోసం తిరిగేలోగా మా అమ్మ ప్రాణమే పోయింది సార్" అన్నాడు.

నేను మరేం మాట్లాడలేకపోయాను.

"మళ్ళీ ఎక్కడేనా చేయాలన్నా అన్ని మెకానిక్ షాపుల్లోనూ నాలాంటి కుర్రాళ్ళు ఎక్కువగానే వున్నారు సార్. ఎవరూ తీసుకోలేదు. ఖాళీగా వుంటే మా దూరపు బంధువొకాయన జాలిపడి తనే మదుపు పెట్టి యిందులో పెట్టేడు. అయినా యిదేం తక్కువ బిజినెస్సేం కాదు సార్" అంటూ వివరాలు చెప్పేడు.

ఎనభై రూపాయలిస్తే వంద రూపాయల టిక్కెట్లిస్తాడట ఏజంటు. జీతాల రోజుల్లో కంపెనీల దగ్గరా, ఆ తర్వాత నాలుగు రోడ్ల జంక్షన్లలోనూ టిక్కెట్లు బాగానే అమ్ముడవు తాయట. రోజు వారీ కూలీల దగ్గర్నించి పెద్ద ఆఫీసర్ల దాకా, చిన్న వ్యాపారస్తుల నించి బడాబాబుల దాకా కొంటూనే వుంటారట. నెలవారీ ఖాతాలు కూడా చాలానే

వుంటాయనట. వాటి అమ్మకం మీదొచ్చిన లాభమే కాకుండా ప్రైయిజులు తగిల్తే కమీషన్ కూడా వస్తుందట. యీ వివరాలన్నీ చెప్పి;

"ఈ నెలాఖర్లో డ్రా వున్న నాలుగు లాట్రీలున్నాయి. టిక్కెట్లిమ్మంటారా సార్" అన్నాడు వాడు మెరిసే కళ్ళతో నా వంక ఆశగా చూస్తూ –

మరో వ్యాపారమేదైనా అయితే వాడిని తప్పకుండా ఎంకరేజ్ చేసేవాడినే. కానీ లాటరీ వ్యాపారం మీద నాకు మంచి అభిప్రాయం లేదు.

నా దృష్టిలో అదో వ్యసనం. ఆ విషయమే వాడితో చెప్పి; "నువ్వు యిది కాకుండా మరే పని చేసినా నేను సంతోషించి వుండేవాడిని" అన్నాను.

దెబ్బతిన్న పులిలా నా వంక చూశాడు.

"ఏదో... మాలాంటి వారిక్కూడా రోజు గడవాలి గదా సార్, దీంతో పాటు పొద్దున్నే డెయిలీ పేపరు కూడా యింటింటికీ వేస్తున్నాను" అన్నాడు.

ఏదైనా పని నేర్చుకుని బ్రతుకులో స్థిరపడాలనుకున్న పిల్లలు కూడా యిలా ఎందుకూ కొరగాని పనులు చేస్తూ ఎదుగూ బొదుగూ లేని జీవితాలు గడుపుతున్నారంటే కాస్త కష్టమనిపించింది.

ఇటువంటి పిల్లల కోసం కర్నాటక రాష్ట్రంలోని కొన్ని స్వచ్ఛంద సంస్థలు బాల వికాస కేంద్రాలను నడుపుతూ అవసరమైన వారికి తగిన ఆశ్రయం కల్పించి, వివిధ వృత్తులలో శిక్షణ నిచ్చి, వారి జీవన భృతి కోసం వేతనాన్ని ఏర్పాటు చేసి, శిక్షణ పొందిన వారికి తగిన ఉద్యోగమో, ఉపాధో లభించేలా చేస్తున్నాయి.

అనాథ బాలలలో ఆత్మవిశ్వాసాన్ని కలుగచేసి, వారికి తమ కాళ్లపై తాము నిలబడేటట్టు చేస్తున్నాయి. ఇష్టమైన పనిలో శిక్షణ పొంది ఆత్మ సంతృప్తితో డబ్బు సంపాదించుకోవడం, పొదుపూ, ఆరోగ్య సూత్రాలనూ పాటించడం, క్రమశిక్షణలో పెరగడం... ఆ వయసు పిల్లలకే నేర్పుతున్నాయి. అటువంటి సంస్థలే గనుక ప్రతి రాష్ట్రంలోనూ ఏర్పడితే అనంతం లాంటి పిల్లల జీవితాలు మరోలా వుండేవి కదా అనిపించింది.

ఆ రోజు తర్వాత అనంతం నాకెక్కడా ఏ రూపంలోనూ కనిపించలేదు.

నా మాట వాడి మనసుకు బాణంలా తాకిందేమో మరి! అంత మాత్రాన వాడిని గురించి నా మనసు మరోలా వూహించలేకపోయింది.

లాటరీ టిక్కెట్లమ్మకం మానేశాడా?

మానేసినా, అది తాత్కాలికమే అవుతుంది.

ఈ వూళ్ళో కాకపోతే మరో వూళ్ళో – లాటరీ టిక్కెట్లమ్మకపోతే బ్రాందీ షాపులోనో... మరో బార్‌లోనో పని చేస్తాడు. చెయ్యాలి!

అటువంటి వారి జీవనసమస్య ఎప్పటికీ అనంతమే మరి!

*రచన మాసపత్రిక – మే, 1995*